

# మళ్ళీ తద్దినం ఎప్పుడొస్తుందో! ఏవిటో!



దక్షిణంపక్క గుమ్మంలో కూచుని కొబ్బరినూనెసీసా దగ్గిరెట్టుకుని అమ్మ ఒక్కొక్కళ్ళకే జడలేస్తోంది నూనె రాసి చిక్కులు తీసి. చిన్నారికి రెండు జడలయినా లావుగా, పొడుగ్గా వస్తాయి గాని నాకు ఒక్క జడే సన్నగా వస్తుంది. అందుకే అదెప్పుడూ నన్ను 'ఇల్లేరమ్మ

ఎలకతోక' అని ఎక్కిరిస్తుంది. కానీ అసలు విషయం అమ్మెప్పుడో నాకు చెప్పింది 'బుద్ధిశాలి జుట్టు భుజాలు దాటదని'.

ఇంతలోనే ఇల్లు గల అమ్మమ్మ గారి కేక వినిపించింది.

''సరోజమ్మా సుబ్బమ్మ గారొచ్చారు. మరి మాట్టాడుకోడానికి రా'' అని. నాకు జడేస్తున్నదల్లా రిబ్బను నాకిచ్చి ఆ రెండల్లులు అల్లేసుకుని రిబ్బను పెట్టేసుకోవే అని ఇప్పుడు వంటావిడతో నేనేం మాట్లాడుకోవాలబ్బా అనుకుంటూ పెరట్లోకి నడిచింది.

''వీరేనండీ మన దక్షిణం వాటాలో కాపురముంటున్న వెంకటేశ్వరరావుగారూ, సరోజమ్మానూ. ఆయనకేదో కంపెనీలో ఇంజనీరుద్యోగం. మన వీధి చివర నీళ్ళ ట్యాంకులు కట్టిస్తున్నది వీళ్ళే. అవటానికి మన వాళ్ళేగాని తూరుపు వాళ్ళు. రాజమండ్రిట వీళ్ళ వూరు. నలుగురూ ఆడపిల్లలే. మార్గశిర శుద్ధ త్రయోదశి వీరి మావగారి ఆబ్దికం. చిన్నపిల్లల్తో ఒక్కత్తే ఏం చెయ్యగలదు ? మీరే నడుం కట్టాలి'' అని అమ్మమ్మగారు మా గురించి అన్ని సంగతులు ఆవిడకి చెప్పేశారు.

అమ్మకయితే ఏవీ అర్థం కానట్టు మొఖం పెట్టింది. ''మా ఇంట్లో తద్దినమని మీకెవరు చెప్పారు ? మా వూళ్ళో బావగారు పెడతారు. ఈయనకి అసలు అలాటి నమ్మకాలే లేవు. బతికున్నన్నాళ్ళు ప్రేమగా చూస్తే చాలంటారు'' అని అస్సలు భయపడకుండా చెప్పేసింది.

అమ్మ అలా అనేటప్పటికి అమ్మమ్మగారికి బోల్డు కోపం వచ్చేసింది. ''బలే దానివే ! నాతో అంటే అన్నావు గాని బయటెక్కడా అనమోకు. మొన్న మీ బావగారు రాసిన కార్డు మాదనుకుని చదివేశా. తీరా చూస్తే మీకు వచ్చిందది. ఆయనేదో కేంపు కెడుతున్నాననీ, మార్గశిర శుద్ధ త్రయోదశి నాన్న తద్దినం పెట్టమనీ వ్రాశారు. అక్కడే మీ ఆయన సిగరెట్టు కాల్చుకుంటుంటే చేతికిచ్చానే.''

''లేదు పిన్నిగారూ ! నాతో ఒక్క ముక్కన్నా అనలేదు. ఈయన్ని పని మీంచి రానీయండి. ఇంకా నాలుగు రోజులు టైముందిగా అని అమ్మ నసగడం మొదలెట్టింది.

''ఇంత విడ్డూరమా ! మావగారి తద్దినవంటే ఆలోచించాలనే కోడళ్ళు మెట్టుతున్నారన్న మాట. పిల్లలు కలగలేదని మాలాటి వాళ్ళు దిగులుపడక్కర్లా. అయినా అన్నీ మగవాళ్ళ నడిగేచేస్తావా ఏమిటి ? అందుకే మా పెద్ద మనిషికి ఎన్నిసార్లో చెప్తాను. ఇల్లద్దెకిచ్చేటప్పుడు కాస్త వాళ్ళ పద్ధతులవీ తెలుసుకొనిమ్మని. నా మాట పడనిస్తేగా. పిల్లలున్నారు. బంగారు తల్లుల్లాగా అని పది రూపాయలు అద్దె తక్కువ చేసి మరీ ఇచ్చారు'' కోపంతో ఆవిడ మొఖం ఎర్రగా అయిపోయింది. అమ్మేమో అలా నిలబడిపోయింది.

''అమ్మా ! తద్దినం అంటే ఏవిటే ?''

''నువ్వు మొన్న ఆదివారం అమ్మమ్మగారితో వెళ్ళి ప్లీడరు గారింట్లో భోంచేసి రాలా మూడు గంటలకీ. తద్దినమంటే అదీ, మనింట్లో ఆ రోజున మన తాతగారు మనింటికొస్తారన్న మాట భోజనానికి.''

''అయ్యో తాతగార్ని చూడాలని ఎప్పట్నించో ఆశగా వుందమ్మా. నువ్వేం అడ్డం పడకమ్మా నాన్నకి నే చెప్తాగా. నువ్వు సుబ్బమ్మ గారితో మాట్లాడేసుకో. మళ్ళీ ఆవిడ వెళ్ళిపోకండాను!''

ఇంతట్లోకీ సుబ్బమ్మ గారికి తొందరెక్కువయి పోయింది. ''తొరగా కానీయండమ్మాయ్. నాకు వంటకి వేళవుతోంది. అసలింతకీ ఎంతమందవుతారో ! చేతి కిందకెవర్నన్నా తెచ్చుకోవాలి గదా. వాళ్ళకి ముందే చెప్పాలాయె!''

అమ్మమ్మగారే చెప్పేశారు ''మనింట్లో మూడు వాటాలు కాకుండా, మేడమీద స్టూడెంటు కుర్రాళ్ళు నలుగురు, క్రొవ్విడివాళ్ళింట్లో, సరే, మీ ప్లీడరు గారింట్లో, లక్కరాజు వాళ్ళింట్లో ఎంత లేదన్నా నలభై మందవుతారు.''

''సర్లెండి, మా అక్కయ్య కొడుకుని, మా అల్లుడ్ని చేతికిందకి తెచ్చుకుంటా. భోక్తలకి కూడా పని కొస్తారు. రామశాస్త్రి గారిని వేరే భోక్తలకెవరికీ చెప్పద్దనండి. బోల్డు మడి నీళ్ళు తోడాలి కదా. నాకు ఎనిమిదీ, వాళ్ళిద్దరికీ చెరో రెండూ దక్షిణ కాకుండా. మీకు తెలియనిదే వుంది. ధరలెలా మండిపోతున్నాయో మీరే చూస్తున్నారుగా ! కాస్త పాలు పెరుగు సంగతి కోటమ్మకి చెప్పి మంచివి పోయించుకోండి. ఆ అమ్మాయికేం తెలిసినట్టు లేదు పాపం'' అని మా అమ్మకేసి తిరిగన్నా చూడకుండా వెళ్ళిపోయింది.

అమ్మ అప్పుడు పడ్డంత ఖంగారు జల్లొచ్చి బాగా ఎండిన బట్టలు తడిసి పోతుంటే పడ్డం కూడా నే చూడలా.

తప్పదన్నట్లు నెమ్మదిగా చెప్పింది అమ్మ ''మా అమ్మ వాళ్ళింట్లో అన్నీ పద్ధతిగానే చేస్తారు పిన్నిగారూ ! ఈయనే చిన్నప్పట్నించి పెద్దవాళ్ళ భయభక్తుల్లేక ఏవీ వినిపించుకోరు. మరేం అనుకోకండి. కాకపోతే మావేపు ఇంట్లో ఇంట్లో చేసుకుంటారు గానీ ఇలా అందర్నికేకేసి ఇంత హడావిడి చెయ్యరు'' అని.

''తప్పమ్మా! నువ్వుపైకలా అంటే మీ అత్తారితో ఏవో విరోధాలున్నాయనుకుంటారు. మాగుంటూరు పద్ధతి ప్రకారం ఎరిగున్న వాళ్ళందరికీ చెప్పాల్సిందే. అందరూ ఏదో టయంలో వచ్చి ప్రసాదం తిని వెడతారు కూడాను. నువ్వేం మాట్లాడకు.

మీ బాబాయి గారికి వేరే పనేం వుంది, రేపు సంతకెళ్ళి కూరలన్నీ తెస్తారు. మా హాలు వరండా కడిగించేశావంటే ఒక్కసారిగా భోజనాలయిపోతాయి'' అంటూ ఆవిడ ఇంట్లోకి

వెళ్ళిపోయారు.

'ఇదెక్కడి చావొచ్చి పడిందిరా దేవుడా ! తద్దినం పేరు చెప్పి వూరందరికీ భోజనాల గోలేవిటో. ఎక్కడా ఎరగం. ఖర్చు మాటలా వుంచి ఇప్పుడీ పెద్ద మనిషిని కుదురుగా ఓ చోట అంతేసేపు కూచోబెట్టడం నా వల్ల అయ్యే పనేనా ! అసలు బావగార్నినాలి. ఎప్పుడూ కార్డులు రాయడవే. అత్త ఆడబిడ్డల ఆరళ్ళే ఎరుగను ! ఈ ఇల్లు గలావిడ కోరం(త్రికం పెట్టేస్తే ఎందుకు భరించాలి ?' అని తనలో తనే సణుక్కుంటూ మా ఇంట్లోకి వచ్చేసింది.

అమ్మెప్పుడూ ఎవరిళ్ళకీ వెళ్ళదు కాబట్టి ఏవీ తెలియక భయపడుతోందని నాకర్థం అయిపోయి అమ్మకి ధైర్యం చెప్పా. ''అమ్మా! నువ్వూరికే ఖంగారు పడుతున్నావుగానీ తద్దినాలంటే చాలా బాగుంటాయే. ఏవీ కష్టవుండదు. అన్నీ వంటవాళ్ళే చేసేస్తారు. హాలంతా తుడిచి పెద్ద పెద్ద అరిటాకులేసి బోల్డు బోల్డు ఒక్కసారే పెట్టేస్తారు. నెయ్యయితే చారులా పోస్తారనుకో. గోకర్ణంలో కూరలు ఖండాలంగా ఫుల్లగా వుంటాయి గానీ గారెలు, అప్పాలు భలే బావుంటాయి. అందుకే ఎక్కడికయినా వెళ్ళొస్తూ వుంటే భయం వుండదు. మరేమో నువ్వు బయటకే రావు!'' అని.

''నీకు సరయిన పేరే పెట్టారే తాతగారు ఇల్లేరమ్మని. అందరిళ్ళల్లో తద్దినం భోజనాలు చేసొచ్చి నాకే నీతులు చెప్తున్నావు ! పో అవతలకి'' అని కసిరింది. నాన్న జీపు దిగుతుండగానే చెప్పేశా. మార్గశిర శుద్ధ త్రయోదశినాడు తాతగారొస్తున్నారని, నాన్న ఇంట్లోకొచ్చి టోపీ మేక్కి తగిలించి, షూస్ విప్పుకుంటూ అడిగారు అమ్మని.

''ఏమిటోయ్, మీ అమ్మా నాన్న గారూ వస్తున్నారా ?''

''మా అమ్మా నాన్నగారూ కాదు. మీ నాన్నగారే ! తద్దినం పెట్టడం తనకి కుదరదు. ఈసారికి మిమ్మల్ని పెట్టమని బావగారు కార్డు రాశారుటగా ! పిన్నిగారు అన్ని ఏర్పాట్లు చేసేస్తున్నారు కూడాను!''

''ఆ! వాడు రాస్తే నే చెయ్యడమేనేవిటి ? అయినా ఇరవై ఏళ్ళ క్రితం పోయిన మా నాన్న ఇన్నాళ్ళు ఊరికే వుంటాడా, ఎక్కడో అక్కడ పుట్టే వుంటాడు!'' నాన్న నవ్వడం మొదలెట్టారు.

''అలాంటి వాగుడే ఈ పెద్ద దెయ్యం ముందు వద్దు. గుడ్లేసుకుని ఎలా వింటోందో. ఇంకో నిమిషంలో బయటకెళ్ళి ఆవిడకి పూసగుచ్చినట్టు చెప్పేస్తుంది. మనం కాదూ కూడదంటే ఇల్లు ఖాళీ చేయించేట్లున్నారు. అయినా పాపం ఆవిడే అన్నీ దగ్గిరుండి చేయిస్తున్నారు మనకేం కష్టం లేకుండా.''

''మరీ మంచిది. అయితే ఆ తద్దినం కూడా ఆవిడనే పెట్టేయమను!'' మళ్ళీ నాన్న

నవ్వడం మొదలెట్టారు.

''నా ఎన్న సొన్నె ఇంద పొణ్ణుకు ముణ్ణై ఒణ్ణు చొల్లాదె! అపరం పేశలాం!''

''అమ్మా! పెద్ద బడాయిగా నువ్వూ నాన్నా అరవంలో మాట్లాడుకుంటే నాకు అర్థం కాదనుకుంటున్నావా ? చిన్నప్పట్నించీ నేనూ వింటూనే ఉన్నా మీ దయ్యాల భాష. నేనే బయటికి పోతాలే. పాపక్కా వాళ్ళింటికి. మీరిద్దరూ హాయిగా తెలుగులోనే మాట్లాడుకోండి'' -నేను పుట్టక ముందు మా నాన్న మద్రాసులో తిరుచునాపల్లిలో నాలుగేళ్ళు పని చేశారట. అదీ వీళ్ళ గొప్ప.

ఇంక మరి అమ్మ ఎలా వప్పించిందో తెలియదు గానీ నాన్న దేనికీ అడ్డు చెప్పలా. అమ్మమ్మ గారి కంట పడకుండా ఎక్కడ్నించో జందెమొకటి తెప్పించి నాన్నకి వేసింది. అదీ లేదు నాన్న కని తెలిస్తే అమ్మమ్మగారు వెంటనే ఇల్లు ఖాళీ చేయించేసే వారుట. ఆ విషయం బయటకి చెప్తే పీక నొక్కేస్తానని మధ్యలో నన్ను బెదిరించింది. తద్దినాలంటే స్వామినాథన్ గారికి చాలా ఇష్టంట. అందుకని అడగ్గానే సెలవిచ్చేశారు నాన్నకి. మేవంతా స్కూలుకి వెళ్ళాలని అసలు అనుకోనే లేదు నేనూ ఇల్లుగల తాతగారూ ముందు రోజే అందరిళ్ళకీ వెళ్ళొచ్చాం. తప్పకుండా రండని చెప్తుంటే తాతగారు కేకలేశారు.

''అలా రండని పిలవకూడదు ! ఊరికే ఫలానా రోజు అని చెప్పాలంతే. అయినా కూడా నే వున్నదెందుకు'' అని.

మరి మాదేమో గుజ్జనగూళ్ళ సంసారమట. పెద్దగిన్నె లెక్కడ్నించొస్తాయి ? అమ్మమ్మగారు ముందు రోజే అటక మీంచి పెద్ద గిన్నెలన్నీ దింపించారు సుబ్బమ్మ గారి అల్లుడ్ని కేకేసి. ఆ వేళనే తెల్లారి నిద్దర లేచేటప్పటికే ఇల్లు ఎంతో హడావిడిగా పెళ్ళున్నట్టుగా వుంది. రెండు పెద్ద గంగాళాల నిండా నీళ్ళు తోడి పెట్టారు. బోల్డు బోల్డు కూరలు తరిగి కుట్టుడాకుల్లో పెట్టి ఉంచారు. సుబ్బమ్మ గారు దొడ్లోనే రెండు పొయ్యిలు పెట్టుకున్నారు. ఆవిడ అల్లుడేమో పప్పులు రుబ్బుతూనే ఉన్నాడు. అమ్మ ఊరికే కంగారు పడింది గానీ రోజూ ఇంట్లో చేసే పనంత కూడా లేదు తనకి. అటు ఇటు షోగ్గా తిరుగుతూ ఉండడం. వాళ్ళేదయినా అడిగితే అందివ్వడం స్వామినాథన్ గారు సెలవిచ్చినా ఒక్కసారయినా నీళ్ళ టాంకెక్కపోతే నాన్నకి కాళ్ళు పీకు లెట్టేస్తాయిట కదా అందుకని పన్నెండింటికల్లా వస్తానని వెళ్ళిపోయారు. 'ఆయన వెడితేనే సుఖం పిన్నిగారూ వెళ్ళనీయండ'ని అమ్మ. మా అందర్నీ తయారు చేసి ప్రమోదక్కా వాళ్ళింటికి పంపింది అన్నాలు తినిరమ్మని.

నన్నందరు మాటిమాటికి ఇల్లేరమ్మ అని ఎక్కిరిస్తారు కాని అలా తిరుగుతా కాబట్టే కదా నలుగురూ తెలుస్తారు ! ప్రమోదక్కా వాళ్ళింట్లో పధ్నాలుగు గ్లాసులు, రెండు బేసిన్లు

తెచ్చానా! పాపక్కా వాళ్ళింట్లో పెద్ద మూకుడు, జల్లి గరిటెలు తెచ్చానా ! హరేరామ వాళ్ళింట్లోంచి వడ్డన చాపలు తెచ్చానా ! ఇన్ని పనులు చేసినా అమ్మ ఒక్కసారి కూడా నా తల్లే అనదు. అదే నే చేసుకున్న పాపం !

పొద్దున్నే మంచాలన్నీ సందులో పెట్టేయించింది కదా అమ్మ. ఊరకే వుంటే ఏం తోస్తుందని వాటి మీద ముందు చాపలేసి గుడిసెల్లో వుండేవాళ్ళ ఆట ఆడుకున్నాం. ఆ తర్వాత చాపలు తీసేసి దుప్పట్లుపైన వేసి రైలాట ఆడుకున్నాం. అంతా పరుపుల మీద పరుపు లేసుకుని రైలాట ఆడుకుంటుంటే శనిలాగా నిద్దరొచ్చేసి నిద్దర్లు పోయాం అందరమూనూ ! నిద్దట్లో పడి మా తాతగారెప్పుడు వచ్చారో చూడనే లేదు. అన్నాలు తింటున్నప్పుడు గుర్తు వచ్చింది. ''అమ్మా! తాతగారెక్కడ? మాకు చూపించనే లేదూ'' అని.

''రావడవ్వా అయింది. భోంచేసి వెళ్ళిపోవడమూ అయింది. మీరు నలుగురూ ఆ మంచాల సందున పరుపుల మీద ఒకళ్ళ మీద ఒకళ్ళు పడి ఆ నిద్దర్లేవిటే ? నే ఎంత పిలిచానో ! నాలుగు తగల్నిద్దామంటే మడి కట్టుకున్నా గదా. ఆయనిచ్చిన అక్షింతలు అక్కడే పెట్టా.''

నాకయితే ఎంత దిగులేసిందో. ఈ వెధవ రైలాట ఆడుకోబట్టి గదా నిద్దరొచ్చేసింది. ఏ స్కూలాటో అయితే మెళకువయినా ఉండేది. ఇంత కష్టపడ్డా తాతగార్ని చూడ్డం అవనే లేదు. మళ్ళీ మార్గశిర త్రయోదశి ఎప్పుడొస్తుందో ! మళ్ళీ తద్దినం ఎప్పుడొస్తుందో ! తాత గారెప్పుడొస్తారో ఏవిటో !